క్లుప్తంగా

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న దుంపా చెంచిరెడ్డి, ఎంపీడీవో, జెడ్పీటీసీ

చీమకుర్తి: జగనన్న కాలనీల్లో ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దుంపా రమణమ్మ, ఎంపీడీవో కే రాఘవేంద్ర తెలిపారు. సోమవారం సంతనూతలపాడులోని జగనన్న కాలనీలకు సంబంధించిన ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. పూర్తి కాని ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి ఉగాది నాటికి సిద్ధం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉప్పుగుండూరు విద్యార్థికి రాష్ట్ర స్థాయిలో మొదటి బహుమతి



కార్తీక్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, కళాశాల సిబ్బంది

నాగులుప్పలపాడు: శ్రీకాకుళంలో జరిగిన 66వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్‌లో అండర్–17 విభాగంలో ఉప్పుగుండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి డి.కార్తీక్ లాంగ్ జంప్, హైజంప్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగనాయకులు, కళాశాల సిబ్బంది కలిసి కార్తీక్‌ను అభినందించారు.

పేకాట శిబిరాలపై ఎస్‌ఈబీ దాడులు

కొత్తపట్నం: పేకాట శిబిరాలపై సోమవారం ఎస్‌ఈబీ సిబ్బంది దాడులు చేశారు. కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామ పరిధిలో సాయిబాబా ఆలయం వెనుక పేకాట ఆడుతున్నట్లు తెలుసుకున్న ఎస్‌ఈబీ ఎస్సై మునీర్ అహ్మద్ సిబ్బందితో దాడి చేశారు. ఐదుగురికి అదుపులోకి తీసుకుని రూ.3.740 నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు



మృతుడు

ఒంగోలు టౌన్: స్థానిక ఏబీఎం జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల 17వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజు ఉదయం కళాశాలకు వచ్చిన ప్రిన్సిపాల్ జూడి వినూత్న పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసి స్థానిక జీజీహెచ్‌కి మృతదేహాన్ని తరలించారు. పోలీసుల విచారణలో మృతుడికి చెందిన వివరాలు తెలియరాలేదు. స్థానికులిచ్చిన సమాచారం మేరకు 65 ఏళ్ల వయసు కలిగిన మృతుడి పేరు అప్పలరాజు అని, శ్రీకాకుళానికి చెందిన వ్యక్తి అయి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి కుడి చేతిమీద శ్రీరామ, ఎడమ చేతి మీద శిలువ గుర్తులతో పచ్చబొట్టు వేసి ఉంది. పూర్తి వివరాలు తెలియకపోవడంతో సోమవారం పంచనామా అనంతరం మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి కేసును విచారిస్తున్న టూటౌన్ ఎస్సై షేక్ మీరాసాహెబ్ తెలిపారు.

పొగాకు క్యూరింగ్‌లో మెళకువలు పాటించండి

● వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు



దావగూడూరులో పొగాకును పరిశీలిస్తున్న టుబాకో బోర్డు అధికారులు

జరుగుమల్లి(సింగరాయకొండ): పొగాకు క్యూరింగ్, ఉత్పత్తిలో మెళకువలు పాటించి నాణ్యమైన దిగుబడులను సాధించాలని టంగుటూరు వేలం నిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు రైతులకు సూచించారు. జరుగుమల్లి మండలం దావగూడూరులో సోమవారం పొగాకు బోర్డు ఆధ్వర్యంలో రైతులకు, సిబ్బందికి పొగాకు తయారీలో మెళకువలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ.. పక్వానికి వచ్చిన ఆకులనే తుంచి బ్యారన్లలో అమర్చాలని, అన్య పదార్థాలు లేకుండా టార్పాలిన్ పట్టలు వాడాలని సూచించారు. పొగాకు క్యూరింగ్ సమయంలో బ్యారన్ లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పొగ గొట్టాలపై ఇనుప జాలీ అమర్చాలని, పరిమితికి తగ్గట్లు కర్రలు అమర్చాలని, ఉష్ణోగ్రతను తెలిపే థర్మామీటరును బ్యారన్‌లో తప్పనిసరిగా ఉంచాలన్నారు. అనంతరం పొగ తోటలను, బ్యారన్లను పరిశీలించారు. ఈనెల 31వ తేదీలోగా రూ.10 వేల వడ్డీ లేని రుణానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పొగాకు బోర్డు సీనియర్ గ్రౌండింగ్ అధికారి జి.సునీల్ కుమార్, ఐటీసీ ప్రతినిధి జి వెంకట్రావు, జీపీఐ ప్రతినిధి ఆలీ పాల్గొన్నారు.

పేదల కలలన్నీ సాకారం

● ప్రజల ఆశలకు ప్రాణం పోసిన జగనన్న
● సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



మద్దిపాడులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్, నాయకులు

మద్దిపాడు: పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల ఆశలకు ప్రాణం పోసి వారి కలలను సాకారం చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనం గుండెల్లో గుడి కట్టుకున్నారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. మండల కేంద్రమైన మద్దిపాడులో సోమవారం రెండో రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నిరుపేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో వేలాది మందికి ఇళ్ల స్థలాలిచ్చి గృహాలు నిర్మించుకోవడానికి సహాయం చేశారని తెలిపారు. అర్హులందరికీ గూడు కల్పించి వారి గుండెల్లో నిలిచిపోయారన్నారు. పేద పిల్లలు సౌకర్యాలు లేని సర్కారు బడుల్లో చదవడం చూసి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తయారు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన పేదల పక్షపాతి అని అన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంటుందని నమ్మిన వ్యక్తి అని, అందువలనే కేజీ నుంచి పీజీ వరకూ ప్రతి విద్యార్థికి చదువుకోవడానికి అవకాశం కల్పించారని ఎమ్మెల్యే అన్నారు. పేద ప్రజలను పలు పథకాల ద్వారా ఆదుకుంటున్నారన్నారు. రాష్ట్రం లక్షల రూపాయల అప్పులో మునిగిపోయిందని పచ్చ పత్రికల ద్వారా చంద్రబాబు ప్రచారం చేస్తున్నారని, నిజానికి గత ప్రభుత్వం ఎంత బడ్జెట్ కేటాయించిందో అంతే బడ్జెట్ ప్రస్తుతం కేటాయిస్తున్నామని అన్నారు. కానీ అప్పటి నాయకులు పలు మార్గాల ద్వారా పేదలకు చేరాల్సిన సహాయాన్ని దిగమింగారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి ఒక్క బటన్ నొక్కడం ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నేరుగా పథకాల నగదు జమవుతోందన్నారు. మధ్యలో దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు పథకాల నగదు జమ చేస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు గుండెల్లో పెట్టుకుని పూజిస్తున్నారని, ఆ విషయం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పష్టంగా తెలిసిపోతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పచ్చ పత్రికల విషపు రాతలను ప్రజలు చీదరించుకుంటున్నారని, వాస్తవాలు ప్రజలకు తెలుసని అన్నారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని తెలిపారు. రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పలువురు మహిళలు ఎమ్మెల్యే టీజేఆర్‌కు హారతులిచ్చి దీవెనలు అందించారు. 50 వేల గడపలు పూర్తి చేసిన సందర్భంగా పలువురు నాయకులు ఎమ్మెల్యేతో కేక్‌లు కట్ చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జెడ్పీటీసీ తేళ్ల భాగ్యలక్ష్మి పుల్లారావు, వైస్ ఎంపీపీలు మోరబోయిన విజయలక్ష్మి, పైడిపాటి వెంకట్రావు, గట్టినేని అయ్యన్న, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, మోరబోయిన సంజీవరావు, బాలాంజనేయరెడ్డి, గుడ్డపాతల రవి, పొగాకు బోర్డు వైస్ ప్రెసిడెంట్ మద్దా లక్ష్మీనారాయణ, మండల కన్వీనర్లు బత్తుల శ్రీను, కొమ్మూరి సుధాకర్, మజీద్, షేక్ బాబు, బెజవాడ రాము, గ్రామ సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు లక్ష్మీనారాయణాచార్యులు, నట్టే అనిల్, ఉన్నం ప్రశీద, సన్నపురెడ్డి రమణమ్మ, మాజీ సర్పంచ్‌లు జయమ్మ, సింగయ్య, పలువురు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపుపై హర్షం

● సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకులు

చీమకుర్తి: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలును పొడిగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్డినెన్స్ ఇవ్వడంతో ఎస్సీ, ఎస్టీ నాయకులు, సీఎం చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. చీమకుర్తిలోని 1వ సచివాలయం వద్ద స్థానిక కౌన్సిలర్ తప్పెట బాబూరావు, వైఎస్సార్ సీపీ నాయకులు దుడ్డు మార్కు, మట్టిగుంట రామాంజనేయులు, ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వలంటీర్లు, అధికారులు, ఉద్యోగులు సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా నేతాజీ జయంతి



నేతాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సొసైటీ చైర్మన్ గట్టినేని అయ్యన్న, గ్రామస్తులు

మద్దిపాడు: మండలంలోని పెదకొత్తపల్లి గ్రామంలో ఉన్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి సొసైటీ అధ్యక్షుడు గట్టినేని అయ్యన్న సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ సమయంలో నేతాజీ ఏర్పాటు చేసిన సైన్యంలో పెదకొత్తపల్లి వాసులు కొందరు పాల్గొన్నారని తెలిపారు. వారికి గుర్తుగా గ్రామంలో నేతాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. గత 50 సంవత్సరాలుగా గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేతాజీ విగ్రహం తమ గ్రామంలో ఉండటం తమకు గర్వకారణమని అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వీరులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు, కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి, గోనుగుంట శ్రీను, బోయపాటి చిరంజీవి, నర్రా చిరంజీవి, బూసరపల్లి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ ఉప కులాలను అసెంబ్లీకి పంపిస్తాం



విశ్వనాథంను సన్మానిస్తున్న కార్యకర్తలు

ఒంగోలు టౌన్: బడుగు, బలహీనవర్గాలను కలుపుకుని 2024 అసెంబ్లీ ఎన్నికల్లో విజయఢంకా మోగించడంతో పాటు మాదిగ ఉపకులాలను అసెంబ్లీకి పంపించే బాధ్యత ఎమ్మెస్ పార్టీ తీసుకుందని మహజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైకే విశ్వనాథం అన్నారు. ఎమ్మెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన ఆయనను సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందా కృష్ణమాదిగ పిలుపు మేరకు మహనీయుల ఆశయ సాధన కోసం పాటుపడాలన్నారు. గెలుపే లక్ష్యంగా మహజన సోషలిస్టు పార్టీ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. అభినందన సభకు తోరటి ఆనంద్ అధ్యక్షత వహించగా, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో ఒంగోలు చిన్నారుల సత్తా



జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటిన చందు డ్యాన్స్ అకాడమీ చిన్నారులు

ఒంగోలు: స్థానిక లాయరుపేటలోని చందు డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటారు. అకాడమీలో సోమవారం వారికి అభినందన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు చిలకలూరిపేట కళానిలయం సంస్థ నిర్వహించిన మ్యూజిక్ అండ్ డ్యాన్స్ పోటీల్లో తమ సంస్థ విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించడం ఆనందంగా ఉందని అకాడమీ అధినేత త్రోవగుంట చందు తెలిపారు. గత 37 సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా తమ సంస్థ ఆధ్వర్యంలో సంగీత, క్లాసికల్ నృత్య పోటీల్లో పాల్గొంటూ బహుమతులను కైవసం చేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే చిలకలూరిపేట సంస్థ నిర్వహించిన 38వ జాతీయ స్థాయి పోటీల్లో క్లాసికల్ సీనియర్స్ విభాగంలో నిడమానూరు ఝాన్సీ (ప్రథమ బహుమతి), జి.కళ్యాణి (తృతీయ), క్లాసికల్ జూనియర్స్ విభాగంలో ఆర్.హన్సిక (ప్రథమ)తో పాటు క్లాసికల్ జూనియర్ గ్రూప్ తృతీయ, సీనియర్స్ గ్రూప్‌లో ద్వితీయ బహుమతులను కైవసం చేసుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులను శ్రీకృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, కవి నూనె అంకమ్మరావు, రచయిత్రి పి.అరుణ తదితరులు పాల్గొని అభినందించారు. చిన్నారులతో పాటు పోటీలకు కో ఆర్డినేటర్లుగా వ్యవహరించిన కోవెలకుంట బాలకోటయ్య, జి.సాగర్‌ను కూడా అభినందించారు.

ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయండి



ప్రచారంలో పాల్గొన్న రైతు సంఘ నాయకులు

నాగులుప్పలపాడు: జాతీయ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన రైతాంగ ఉద్యమంలో రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘ నాయకులు జయంత్‌బాబు, చుండూరి రంగారావు కోరారు. ఆ మేరకు కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో మండలంలోని అమ్మనబ్రోలు, చీర్వానుప్పలపాడు గ్రామాల్లో సోమవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వంలో రైతాంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొందని, రైతుల పోరాటంతో సాధించుకున్న హామీలు త్వరితగతిన నెరవేర్చుకోవడానికి రైతులు కదం తొక్కాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు చుంచు శేషయ్య, హనుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ సందడి

● అభిమానుల ఆనందోత్సాహాల మధ్య బీఎంటీ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న పాయల్ రాజ్‌పుత్

ఒంగోలు: ఆర్‌ఎక్స్ 100 హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ సోమవారం ఒంగోలు నగరంలో సందడి చేసింది. స్థానిక త్రోవగుంట ఐటీసీ కంపెనీల వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బీఎంటీ ఆటోమొబైల్ షోరూంను మొగలిరేకులు సీరియల్, సిద్దార్థ సినిమా హీరో ఆర్‌కే నాయుడు అలియాస్ సాగర్‌తో కలిసి లాంఛనంగా ఆమె ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం యువత కోరిక మేరకు వారితో కలిసి సెల్ఫీలు దిగారు. అనంతరం అభిమానుల కోరిక మేరకు వేదికపై స్టెప్పులు వేసి ఉత్సాహపరిచారు. ఆమె మాట్లాడుతూ తాను ఒంగోలుకు రావడం ఇది మూడోసారని, ఒంగోలు ప్రజలు తనపై చూపిస్తున్న ప్రేమాభిమానాలను తాను నూతనంగా ప్రారంభించిన బీఎంటీ షోరూం యాజమాన్యంపై కూడా చూపించాలని కోరారు. ఆర్‌కే నాయుడు మాట్లాడుతూ బీఎంటీ యాజమాన్యం అంటే తమకు సొంత కుటుంబం లాంటిదని పేర్కొన్నారు. బీఎంటీ మేనేజింగ్ డైరెక్టర్ టి.సురేష్, సంస్థ ప్రతినిధులు సురేంద్ర, వెంకట్, వైఎస్సార్ సీపీ నాయకుడు గొర్రెపాటి శ్రీనివాసరావు, ప్రముఖ వ్యాపారవేత్తలు మండువ మురళీకృష్ణ, రమావేమిరెడ్డి, నారాయణరెడ్డి, గ్లోబల్ శివ తదితరులు పాల్గొన్నారు.

28న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

సీఎస్‌పురం: మండలంలోని జంగంవారిపల్లిలో ఈ నెల 28న రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టాభి రామచంద్రస్వామి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ.60 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ.10 వేలు ఇస్తామన్నారు. అదే విధంగా పోటీల్లో పాల్గొన్న ప్రతి ఎడ్లకు రూ.5 వేలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న ఎడ్ల యజమానులు ఈ నెల 27వ తేదీ లోగా రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 6303730448, 9019873815 నంబర్లను సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగార్పమ్మ విగ్రహ ప్రతిష్ఠ



హోమంలో పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

● పాల్గొన్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని

ఒంగోలు సబర్బన్: నగరంలోని అంకమ్మపాలెంలో నాగార్పమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠతో పాటు హోమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జడా వెంకటేష్, కోటి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను ప్రారంభించిన బాలినేని



సీసీ రోడ్డు, డ్రెయిన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: నగరంలోని 33వ డివిజన్ మంగమూరు రోడ్డులో సీసీ రోడ్డు, డ్రెయిన్లను వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా.. రూ.40.35 లక్షలతో నిర్మాణం పూర్తి చేసుకున్న సిమెంటు రోడ్డు, డ్రెయిన్‌ను బాలినేని ప్రారంభించారు.

కమలమ్మకు బాలినేని నివాళులు

వైఎస్సార్ సీపీ నాయకుడు చుండి బాలాజీ తల్లి చుండి కమలమ్మ మృతిచెందడంతో ఆమె మృతదేహానికి వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం నివాళులర్పించారు. బాలాజీతో పాటు కుటుంబ సభ్యులను బాలినేని పరామర్శించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో శిద్దా పూజలు



పూజలు చేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు

చీమకుర్తి: శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా చీమకుర్తిలోని హరిహరక్షేత్రంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు సోమవారం పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆశీర్వాదాలు స్వీకరించారు. భక్తులు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు.

చిన్నారులకు ఆటల పోటీలు

● లాంఛనంగా ప్రారంభించిన నగర మేయర్ గంగాడ సుజాత



జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతి, ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాల సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్, జేసీస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆటల పోటీలను స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నగర మేయర్ గంగాడ సుజాత సోమవారం ప్రారంభించారు. తొలుత జాతీయ పతాకాన్ని ఎగురవేయడంతో పాటు శాంతి కపోతాలను ఎగురవేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్వాహక సంస్థలు నేతాజీ ఆశయాలను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలనే ఒక మంచి ఉద్దేశంతో పాటు గణతంత్ర దినోత్సవం ప్రాముఖ్యతను చిన్నారులకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చదువుతోపాటు ప్రతి చిన్నారి క్రీడల్లో కూడా రాణిస్తూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని, అందుకోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. అందుకు తగ్గట్లుగా ప్రతిఒక్కరూ శారీరక, మానసిక ఉల్లాసాన్ని కలిగి ఉండాలన్నారు. పీటీసీ ప్రిన్సిపాల్ ఏఆర్ దామోదర్, రిటైర్డ్ ఎస్పీ కాకుమాను రాజశిఖామణి మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని, స్ఫూర్తిని, క్రమశిక్షణను పెంపొందిస్తాయని తెలిపారు. అందుకు నిర్వాహకులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం నగరంలో ఎంపిక చేసిన కొంతమందికి వైద్యం, పరిశుభ్రత పరిరక్షణ, లా అండ్ ఆర్డర్ వంటి వివిధ రంగాలలో లయన్ సేవా పురస్కారం అవార్డులు అందించారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ హరిబాబు, రెడ్ క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు, లయన్స్ ఒంగోలు అధ్యక్షుడు డాక్టర్ ప్రకాష్ చావ్లా, ఒంగోలు జేసీస్ అధ్యక్షుడు పులి రామాంజనేయులు, లయన్ శాండిల్య, క్రీడల ప్రాజెక్టు కో ఆర్డినేటర్ సోమినేని సురేష్‌బాబు, జేసీస్ కార్యదర్శి కసిబిసి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు వివిధ రకాల ఆటలో పోటీలు నిర్వహించారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.15 లక్షలు



విరాళం అందజేస్తున్న దాతలు

సీఎస్‌పురం: మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,15,349 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నర్రా నారాయణరెడ్డి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టికెట్ల అమ్మకం ద్వారా రూ.57,040, స్వామి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.22,845, స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతలు ఇచ్చిన విరాళం రూ.35,464 వచ్చినట్లు చెప్పారు.

విద్యుత్ తీగలు తగిలి మేకలు మృతి

గుడ్లూరు: విద్యుత్ తీగలు తగిలి నాలుగు మేకలు మృతి చెందాయి. ఈ మండలంలోని గుండ్లపాలెంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన చినకొండయ్య, ప్రసాద్‌లు మేకలను మేపుకోవడానికి పొలాలకు వెళ్లగా..రెండు స్తంభాల మధ్య విద్యుత్ తీగ తెగి కింద పడి ఉంది. అటుగా వెళ్లిన నాలుగు మేకలకు విద్యుత్ తీగ తగలడంతో షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన నాలుగు మేకల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.